సాక్షి
మంచిర్యాల
బుధవారం • 14 • ఆగస్టు • 2024



రావమ్మా.. మహాలక్ష్మి

ఈ నెల 14 నుంచి 19 వరకు వరుస సెలవులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని డిపోల నుంచి ప్రధాన రూట్లలో ఆర్టీసీ అదనపు బస్సులు నడపనుంది.

8లో

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర వేడుకలకు ప్రభుత్వ సలహాదారు

మంచిర్యాలటౌన్: ఈ నెల 15న మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌ను ముఖ్య అతిథిగా నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి ఉత్తర్వులను జారీ చేశారు. 15న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు విద్యార్థులు సెప్టెంబర్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో డే స్కాలర్‌గా 2024–25 విద్య సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు htpp//bs e.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని 13న హార్డ్ కాపీలు డీఈవో కార్యాలయంలో అందజేయాలని వివరించారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎక్కువ మంది పిల్లలు పరీక్షకు దరఖాస్తు చేసేలా చొరవ చూపాలని సూచించారు.

టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ముజాహిద్



ముజాహిద్

మందమర్రిరూరల్: టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఊరు మందమర్రికి చెందిన ఎండీ.ఇసాక్ ముజాహిద్ నియమితులయ్యారు. ఈమేరకు చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాములు



శ్రీపతి రాములు

నస్పూర్: జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషనజిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీరాంపూర్‌కు చెందిన శ్రీపతి రాములు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మానవహక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ



రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలోని వార్డుల్లో ఉన్న రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు వస్తున్నాయా అని ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణను అడిగారు. వైరల్ ఫీవర్లు మాత్రమే నమోదయ్యాయని, అనుమానితులకు డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ఆస్పత్రిలో ప్రసవాలు పెంచాలి

కోటపల్లి: ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. అనుపత్రిలో సేవలు, వైద్యసిబ్బంది వివరాలు, ఓపీల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

బెల్లంపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శంకర్



శంకర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కాంపల్లి శంకర్ నియమితులయ్యారు. ఈమేరకు తెలంగాణ కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన టీఎస్.ప్రవీణ్‌కుమార్ హన్మకొండకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఫుల్ అడిషనల్ చార్జితో శంకర్‌కు ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించారు. బెల్లంపల్లి వాసి అయిన శంకర్ కష్టపడి ఉన్నత చదువులు చదివి అంచెలంచెలుగా ప్రిన్సిపాల్‌స్థాయికి ఎదిగారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌ను అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పైసా వసూల్!



- మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ల చేతివాటం
- ఉద్యోగాలిప్పిస్తామని డబ్బుల వసూళ్లు
- తాత్కాలిక విధుల కోసమే రూ.లక్షల చెల్లింపు
- మంచిర్యాల, బెల్లంపల్లి, నస్పూర్ బల్దియాల్లో ఘటనలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాదేదీ అవినీతికి అనర్హం అన్నట్లు వ్యవహరిస్తున్నారు జిల్లాలోని కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు. తాజాగా మంచిర్యాల పట్టణ పరిధిలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి డబ్బుల వసూళ్ల ఘటనలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. పాలక సంస్థల్లో పలు ఉద్యోగాలు పెట్టిస్తామంటూ పైసలు తీసుకున్న ఘటనలు ఉన్నాయి. జిల్లాలో మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి పట్టణ పురపాలక సంస్థలు ఉన్నాయి. ఈ పురపాలికల్లో కొత్త నియామకాలు చేస్తున్న సందర్భంలో కొందరు ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడుతూ అటు కార్మికులను ఇటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. పాలకవర్గంలో కీలకంగా ఉన్న వ్యక్తులతో కలిసి, కొందరు కౌన్సిలర్లు ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు మున్సిపల్ ఉద్యోగాలు ఆశ చూపి రూ.లక్షలు తీసుకుంటూ మోసం చేస్తున్నారు. సరిపడా నిధులు లేక బల్దియాలు ఉన్న సిబ్బందికే నెలవారీగా వేతనాలు చెల్లించడం లేదు. పారిశుధ్య, అవుట్ సోర్సింగ్ కార్మికులకు నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. జీతాలు చెల్లించలేని పరిస్థితిలోనూ కొత్తవారికి అవకాశాలంటూ వసూళ్ల దందా చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులదే ప్రధాన పాత్ర

మంచిర్యాల మున్సిపల్ పరిధిలో వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి వారసులను నియామకం చేయాలనుకున్నారు. ఇందుకోసం 8 మందిని విధుల్లో తీసుకునేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల చొప్పున రూ.4 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో తననే బాధ్యుడిని చేయడంపై ఒప్పంద కార్మికుడు నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో వసూళ్ల బాగోతం బయటపడింది. అయితే కొంత కాలంగా కార్మిక సంఘం నాయకుడు హరికృష్ణ, నవీన్, కార్మికుల మధ్య అంతర్గతంగా ఈ వసూళ్లపై పలు మార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరి వ్యక్తుల్లో ఎవరి పాత్ర ఎంతనేది తేలాల్సి ఉంది. మరోవైపు తమ వద్ద డబ్బులు తీసుకుని గత 20 రోజులుగా విధుల్లోకి తీసుకోకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



బెల్లంపల్లి మున్సిపాలిటీలో నియామకాలకు డబ్బులు వసూలు చేసి కాగితంపై రాసిన వివరాలు

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో పట్టణ ప్రగతి సమయంలో తాత్కాలికంగా సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం బాధ్యత చూసేందుకు దాదాపు 20 మంది వరకు విధుల్లోకి తీసుకున్నారు. అయితే ఇది పూర్తిగా తాత్కాలిక సేవలే అయినా నిరుద్యోగుల నుంచి పాలకవర్గంలోని కొందరు సభ్యులు రూ.లక్షలు వసూలు చేశారు. అయితే పట్టణ ప్రగతి కార్యక్రమం తర్వాత కూడా వీరిని కొనసాగించడంతో జీతాలు చెల్లింపుల్లో జాప్యం జరిగాయి. పాలకవర్గంలో కొందరు ప్రజాప్రతినిధులు కొత్తగా చేరిన 18 మంది నుంచి రూ.80 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. సుమారు రూ.18 లక్షల వరకు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కార్మికులను విధుల్లో తీసుకోవడంపై కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు వెళ్లాయి. ఏ కౌన్సిలర్ ఎంత వసూలు చేశారో ఓ కాగితంపై రాసి మరీ ఫిర్యాదులు చేశారు. ప్రస్తుతం ఆ సిబ్బందిని కొనసాగిస్తున్నారు.

నస్పూర్‌లో..

నస్పూర్ పట్టణంలో గత పాలకవర్గంలోని కొందరు ప్రజాప్రతినిధులు చేతివాటం చూపారు. పురపాలక సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధుల్లోకి తీసుకునే వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసిన ఆరోపణలు ఉన్నాయి. అయితే విధుల్లో చేరిన 19 మందిని పలు కారణాలతో రెండు నెలల క్రితం విధుల నుంచి తొలగించారు. దీంతో గత పాలకవర్గం హయాంలో తమ వద్ద నుంచి రూ.లక్షలు తీసుకుని ఉద్యోగాల్లో చేర్పించిన ఆ ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. అయితే వీరిలో అర్హులైన వారిని తిరిగి తీసుకుంటామని కమిషనర్ సతీశ్ తెలిపారు.

అవయవాలు అమ్ముకున్నారు!?



- దానం పేరుతో అంబులెన్స్ డ్రైవర్లు, యజమానుల చేతివాటం
- రూ.15 లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపణలు
- బాధితురాలికి రూ.3 లక్షలే..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి భార్య
- విచారణ చేపట్టిన పోలీసులు

మంచిర్యాలక్రైం: బ్రెయిన్ డెడ్ అయిన.. ఓ యువకుడి అవయవాలు దానం చేస్తే పుణ్యం వస్తుందని అతడి భార్యను నమ్మించారు. దానం చేసినందుకు ఆస్పత్రి ఆర్థికసాయం చేస్తుందని తెలిపారు. ఒక్కరి అవయవదానంతో ఐదుగురి ప్రాణాలు నిలుస్తాయని వైద్యులతో చెప్పించారు. భర్త చనిపోయినా.. అవయవ దానంతో స్వీకరించిన వారిలో బతికే ఉంటాడని చెప్పారు. దీంతో భర్తను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ మహిళ.. అవయవ దానానికి అంగీకరించింది. ఇక ఇదే అదనుగా ఓ కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకున్న అంబులెన్స్ డ్రైవర్ల ముఠా.. యువకుడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి.. అవయవాలు సేకరించింది. బాధితురాలికి రూ.3 లక్షలు అప్పగించి లక్షల రూపాయలు నొక్కేసింది. ఈ నెల 8న జరిగిన ఈ ఘటన మృతుడి భార్య ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి కథనం ప్రకారం.. జైపూర్ మండలం షెట్‌పల్లికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ ఈనెల 6న ద్విచక్రవాహనంపై మంచి ర్యాలకు వెళ్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొ ట్టాడు. ఈ ఘటనలో అతడి తలకు గాయాలయ్యాయి. మంచిర్యాలలో ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని, బ్రెయిన్ డెడ్ అయ్యాడని వైద్యులు అంబులెన్స్ సిబ్బందికి తెలిపారు. అయినా కరీంనగర్‌గానీ, హైదరాబాద్‌గానీ తీసుకెళ్లాలని సూచించారు.

రంగంలోకి దిగిన డ్రైవర్లు, ఓనర్లు..

శ్రీకాంత్ బ్రెయిన్ డెడ్ అయిన విషయం తెలియడంతో స్థానిక ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు రంగంలోకి దిగారు. అసలు నాటకానికి తెరలేపారు. శ్రీకాంత్‌ను కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులు అంబులెన్స్ ఆపి ఎక్కారు. తాము శ్రీకాంత్ స్నేహితులమని అతడి భార్య స్వప్నకు తెలిపారు. కరీంనగర్‌లో తమకు తెలిసిన ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులతో మాట్లాడి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించుకుని హైదరాబాద్ యశోదా ఆస్పత్రికి రెఫర్ చేయించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మరో కార్పొరేట్ ఆస్పత్రి నుంచి స్వప్నకు ఫోన్ చేయించారు. యశోద ఆస్పత్రిలో చికిత్సకు ఎక్కువ డబ్బులు అవుతాయని, మా ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయాన్ని స్వప్న అంబులెన్స్‌లో ఉన్నవారికి తెలిపింది. దీంతో వారు వేసుకున్న ప్లాన్ సక్సెస్ అయింది. అంబులెన్స్‌ను యశోద ఆస్పత్రికి కాకుండా మరో కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు శ్రీకాంత్‌కు బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు.

దానం చేయాలని సలహా..

శ్రీకాంత్ మరణం ధ్రువీకరించిన తర్వాత అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు అవయవదానం డ్రామాకు తెరలేపారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి బతకడని, అవయవ దానం చేస్తే ఐదుగురి జీవితాల్లో వెలుగు నింపొచ్చని శ్రీకాంత్ భార్య స్వప్న, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇదే విషయాన్ని వైద్యులతో కూడా చెప్పించారు. అవకవ దానం చేస్తే ఆస్పత్రి ఫీజు మాఫీ చేయడంతోపాటు ఆర్థికసాయం కూడా చేస్తారని తెలిపారు. దీంతో స్వప్నతోపాటు శ్రీకాంత్ కుటుంబ సభ్యులు సరే అన్నారు. దీంతో ఆ కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్ శరీరంలోని అవయవాలను తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి రూ.3 లక్షలు వారికి ఆర్థికసాయంగా అప్పగించారు.

చేతులు మారిన లక్షల రూపాయలు..

అయితే అవయవ దానం పేరుతో అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు లక్షలు దండుకున్నట్లు తెలియడంతో శ్రీకాంత్ భార్య స్వప్న సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త అవయవాలను అంబులెన్స్ డ్రైవర్లు ఓనర్లు కలిసి ఓ కార్పొరేట్ ఆస్పత్రికి విక్రయించి లక్షలు దండుకున్నారని.. దీనిపై విచారణ జరుపాలని కోరింది. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. నిందితులను విచారణ చేశారు. అనంతరం పూర్తి వివరాలు సేకరించేందుకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి కూడా వెళ్లినట్లు తెలిసింది.

విద్యుత్ అధికారుల 'పొలంబాట'

తాండూర్: వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా చేసే క్రమంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని విద్యుత్ శాఖ డీఈ రాజన్న సూచించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పొలం బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అచ్చలాపూర్, గంపలపల్లి గ్రామాల వ్యవసాయ క్షేత్రాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వంగిపోయిన స్తంభాలను సరిచేసి చెడిపోయిన కెపాసిటర్లు బిగించారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. అనంతరం వర్షాకాలంలో ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. డీఈ రాజన్న మాట్లాడుతూ విద్యుత్ సమస్య వచ్చినప్పుడు సొంతంగా మరమ్మతులు చేయొద్దన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయినా విద్యుత్ శాఖ వాహనంలోనే తీసుకెళ్లి మరమ్మతులు చేసి ఇస్తామని తెలిపారు. ప్రతీరైతు అధికారికంగా కనెక్షన్ తీసుకుని విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. బెల్లంపల్లి ఏడీఈ శ్రీనివాస్, తాండూర్ ఏఈ ప్రభాకర్, సబ్ ఇంజినీర్ కుమార్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

బెల్లంపల్లిరూరల్: విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం పొలం బాట పట్టారు. మంగళవారం బెల్లంపల్లి సబ్ డివిజన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆకెనపల్లి గ్రామ పొలాల్లో విద్యుత్ శాఖ డీఈ రాజన్న పొలం బాట పట్టారు.విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులు సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. హాజీపూర్ మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్ర మంగళవారం నిర్వహించారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం స్వామిరెడ్డి, నాయకులు తిరుపతి, కృష్ణమూర్తి, రమణారావు, సత్యం, ప్రశాంత్, అశ్విన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



యాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ కటిక దుకాణాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అంతరాయం లేకుండా మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. గడిచిన 8 నెలల కాలంలో కొత్తగా వివిధ సామర్థ్యం గల 156 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. దీంతో ఓవర్‌లోడ్ భారం తగ్గిందన్నారు. వేలాడుతున్న విద్యుల్ లైన్లు ఉన్న చోట 461మిడిల్ ఫోల్స్ వేశామని పేర్కొన్నారు. అవసరం ఉన్న, శిథిలావస్థలో ఉన్న చోట కొత్తగా 3,05 0 స్తంభాలు వేశామన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న 39 ట్రాన్స్‌ఫార్మార్ల గద్దెల ఎత్తు పెంపు, పాతలైన్ల మార్పు, కొత్తగా 18 కిలోమీటర్ల మేర లైన్లు వేయ డం జరిగిందని వివరించారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల 2 సబ్‌స్టేషన్లలో విద్యుత్ సామర్థ్యం 5 ఎంవీఏ నుంచి 8ఎంవీఏకు, 3.15ఎంవీఏ ఉన్న చోట 5 ఎంవీఏకు పెంచడం ద్వారా ఓవర్‌లోడ్ భా రం తగ్గనుందని తెలిపారు. ఏబీ స్విచ్‌లు 91 బిగించి నెట్ వ్యవస్థను బలోపేతం చేశామని పేర్కొన్నారు.

మదనం పోచమ్మ హుండీ ఆదాయం రూ.5 లక్షలు

చెన్నూర్: చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయ హుండీలను దేవాదాయ శాఖ నిర్మల్ డివిజన్ పరిశీలకుడు రాజమౌళి పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.5,06,622 ఆదా యం, 18.2 గ్రాముల మిశ్రమ బంగారం, 969 గ్రా ముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఈవో రవి తెలిపారు.

పారిశుధ్య పనులు నిర్లక్ష్యం చేయొద్దు

- కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్: మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. చెన్నూర్ మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, ప్రజాపాలన సేవ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు ఉండడంతో ఫీల్డ్‌మీద ఉండకుండా కార్యాలయంలో ఏం చేస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. ఆరో వార్డులోని పాఠశాలను సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని పాఠాలు విన్నారు. అనంతరం కాలనీలో పర్యటించి మిషన్ భగీరథ నీరు వస్తుందా, ఫాగింగ్ చేశారా, దోమల నివారణ కోసం స్ప్రే చేశారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమృత్ 2.0 పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పాత బస్టాండ్‌లోని టీటీడీ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ సనత్‌కుమార్, ఆర్ఐ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



వార్డు ఆఫీసర్లను ప్రశ్నిస్తున్న కలెక్టర్

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

కోటపల్లి: ఇసుక అక్రమ రవాణకు పాల్పడినట్లయితే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కొల్లూర్, ఎర్రాయిపేట ఇసుక రీచ్ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఇసుక క్వారీలలో ఉండే కాంటా మిషన్లను పరిశీలించి టీఎస్ఎండీసీ సిబ్బందితో మాట్లాడారు. ప్రజల అవసరాలకు ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి అందుబాటు ధరలో ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ చేసిన కలెక్టర్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజాపాలన సేవా కేంద్రంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈజీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. వన మహోత్సవంలో భాగంగా టార్గెట్ ప్రకారం ప్లాంటేషన్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. గ్రామంలోని బొమ్మవాడలో శానిటేషన్, క్లోరినేషన్ పనులు పరిశీలించారు. తాగునీటి సరఫరా నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీవో అజ్మత్ అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని ఉన్నారు.

అక్షరాస్యతతో నవ సమాజ నిర్మాణం

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కాసిపేట: అక్షరాస్యతతోనే నవ సమాజ నిర్మాణం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ధర్మారావుపేట రైతువేదిక, మల్కెపల్లి ఐకేపీ హాల్‌లో వయోజన విద్యాశాఖ, సఖి లయన్స్ మంచిర్యాల ఆధ్వర్యంలో నిరక్షరా స్యులైన వయోజనులకు వంద రోజుల్లో 100 శాతం అక్షరాస్యత, ఉచిత కుట్టు శిక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీవో హాజరై మాట్లాడారు. అక్షరాస్యతతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధిని పొంది ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. జిల్లా వయోజన విద్యా శాఖ అధికారి పురుషో త్తంనాయక్, సఖి లయన్స్ అధ్యక్షుడు , డీఆర్పీ బండ శాంకారి, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డీఆర్పీ రెడ్డిమల్ల ప్రకాశం పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఏసీబీ తనిఖీలు

- నిర్వహణ లోపాలు గుర్తింపు
- రికార్డుల్లో అవకతవకల నిర్ధారణ
- 8 గంటలపాటు సాగిన సోదాలు..

వేమనపల్లి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఏసీబీ ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. హాజరుపట్టిక, తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యలో వ్యత్యాసం గమనించారు. మొత్తం 270 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నట్లు రిజిస్టర్‌లో ఉండగా, పాఠశాలలో మాత్రం 130 మంది మంగళవారం తరగతి గదులకు హాజరైనట్లు నమోదు చేశారు. హాజరుపట్టికకు, గైర్హాజరైన విద్యార్థుల సంఖ్యకు భారీగా వ్యత్యాసం ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. బియ్యం, పప్పులు, ఇతర సామగ్రి స్టాక్ రిజిస్టర్, ఉన్న సరుకులను పోల్చి చూశారు. ఉపయోగించిన సరుకులు, ఉన్న సరుకులను తూకం వేసి వివరాలు రాబట్టారు. పాఠశాలలో బాత్‌రూంలు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదని పేర్కొన్నారు. శానిటేషన్ అధ్వాన్నంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలు ఎన్ని గదులు ఉన్నాయి, ఉపయోగంలో ఉన్నవి ఎన్ని అనే వివరాలు సేకరించారు. మొత్తం 31 రిజిస్టర్లను తనిఖీ చేసి జిరాక్స్ పత్రాలు వెంట తీసుకెళ్లారు. భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. తనిఖీల్లో సీఐలు కృష్ణకుమార్, కరుణాకర్, శానిటరీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రమణమూర్తి

ప్రిన్సిపాల్ పుట్టిన రోజే తనిఖీలు..

గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ బదిలీ కోసం పైరవీలు చేసుకుంటున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు కూడా. ఈ క్రమంలోనే ఏసీబీ తనిఖీలు జరగడంతో షాక్ అయ్యాడు. ఇటీవల కుమురంభీం జిల్లా కల్వాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఎస్జీటీ టీచర్ శ్రీనివాస్‌కు పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా వేమనపల్లికి బదిలీ అయ్యారు. జ్ఞానేశ్వర్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు ప్రిన్సిపాల్ బాధ్యతల్లో ఉండగా పదోన్నతిపై శ్రీనివాస్ రావడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. దీంతో జ్ఞానేశ్వర్ భీమారం, బెల్లంపల్లికి బదిలీపై వెళ్లేందుకు పైరవీలు చేసుకుంటున్నారు. ఇక బదిలీపై వచ్చిన శ్రీనివాస్ మూడు రోజుల క్రితమే చార్జి తీసుకున్నాడు. కానీ వ్యక్తిగత కారణాలతో రెండు రోజులు సెలవులో ఉన్నారు. ఈలోపే ఏసీబీ దాడులు జరగడం, ఆశ్రమ పాఠశాలలో జరిగిన అవకతవకలకు జ్ఞానేశ్వర్‌ను బాధ్యుడిగా ఏసీబీ అధికారులు గుర్తించారు.

క్లుప్తంగా

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

తాండూర్: మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, నలుపు రంగు ఫుల్ షర్ట్, నీలం రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడికాలికి నల్లదారం కట్టి ఉంది. అతను ఏదైనా రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాని, మరే ఇతర కారణంతోనైనా మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే బెల్లంపల్లి రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని దొనబండకు చెందిన రాగుల విమలమ్మ (85) బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. విమలమ్మకు గత రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇంట్లో ఒంటరిగా ఇబ్బందులు ఎ దుర్కొంటుంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన విమలమ్మ మంగళవారం ఇంటి వెనకాల ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త భద్రయ్య ఇది వరకే మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి పెద్ద అల్లుడు గురుచరణం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూపర్ వాస్మాల్ తాగి వివాహిత ఆత్మహత్య

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన వివాహిత గిరుగులే కల్పన(25) సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కల్పనకు గత 8 ఏళ్ల క్రితం రాజేష్‌తో వివాహం కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిర్పూర్(టి)కి చెందిన వీరు రెండేళ్ల క్రితం రెబ్బెనకు వలసవచ్చారు. ఇక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య కుటుంబ కలహాలతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. జీవితంపై విరక్తి చెంది కల్పన సోమవారం ఇంట్లో సూపర్‌వాస్మాల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చంద్రాపూర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజాము మృతిచెందింది.

ఇసుక కుప్పలు సీజ్

రెబ్బెన: మండలంలోని దేవులగూడలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి సీజ్ చేశారు. పక్కా సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా 55 ట్రాక్టర్ల లోడ్, సుమారు 165 క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించి సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపారు. పట్టుబడిన ఇసుకను త్వరలో వేలం వేస్తామన్నారు.

రావమ్మా.. మహాలక్ష్మి

- ఈనెల 14 నుంచి 19 వరకు వరుస సెలవులు
- ఉమ్మడి జిల్లా డిపోల నుంచి 129 అదనపు సర్వీసులు



మంచిర్యాలఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు టీజీఆర్టీసీ శుభవార్త అందించింది. ఆయా డిపోల నుంచి ప్రధాన రూట్లతోపాటు హైదరాబాద్ నుంచి స్పెషల్ సర్వీసులు నడపనుంది. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం, 16న వరలక్ష్మీ వ్రతం, 18 ఆదివారం సెలవు, 19న రాఖీ పౌర్ణమి ఇలా వరుస సెలవులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం ఉన్నవారు స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ఈనేపథ్యంలో 14 నుంచి 19వ తేదీ వర కు ప్రత్యేక బస్సులు నడపనుంది. ఉమ్మడి జిల్లాలోని డిపోల ద్వారా జేబీఎస్ నుంచి 129 బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనుంది.

మంచిర్యాల డిపో నుంచి..

మంచిర్యాల డిపో నుంచి ప్రధాన రూట్లు లక్సెట్టిపేట, జన్నారం, చెన్నూర్, గోదావరిఖని-కరీంనగర్ వరకు ప్రస్తుత బస్సులకు అదనంగా తిప్పేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 150 బస్సుల్లో రాజధాని-03, ఏసీ లహరి-04, నాన్ ఏసీ లహరీ-04, సూపర్‌లగ్జరీ-24, ఎక్స్‌ప్రెస్-06, పల్లెవెలుగు-39, ప్రైవేట్ ఎక్స్‌ప్రెస్-15, ప్రైవేట్ పల్లెవెలుగు-54 బస్సులున్నాయి. ఇందులో 145 బస్సుల ద్వారా 61 వేల కి.మీ మేర బస్సులు తిప్పుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. 5 బస్సులు ఎప్పుడు స్పేర్‌లో ఉండనున్నాయి. రాఖీ పండుగ వేళ ఒక్క బస్సు కూడా డిపోలో ఉండకుండా రోడ్లపై రయ్‌రయ్‌మంటూ తిరుగనున్నాయి. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లిన వారందరూ ఇంటిబాట పట్టనున్నారు. హైదరాబాద్ రెగ్యులర్‌గా 38 బస్సులు నడుపుతున్నారు. రాఖీ, వరుస సెలవుల నేపథ్యంలో మంచిర్యాల డిపో నుంచి ఈనెల 14నుంచి 16వరకు మూడు, 17న 18, 18న 10, 19న 18 బస్సులు తిప్పనున్నారు.

ఆయా డిపోల నుంచి..

ఈనెల 14 నుంచి 19వరకు జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భైంసా, ఉట్నూర్ డిపోలు మినహాయిస్తే రద్దీ నేపథ్యంలో జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు ఆదిలాబాద్ డిపో బస్సులు 21, ఆసిఫాబాద్ డిపో బస్సులు 23, మంచిర్యాల డిపో బస్సులు, నిర్మల్ డిపోకు చెందిన 30 బస్సులు మొత్తం 129 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

మహాలక్ష్మి తర్వాత రాఖీ పండుగతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేసింది. దీంతో మహిళల ఉచిత బస్సు ప్రయాణం రెట్టింపయింది. దీనికితోడు రాఖీ పండుగకు రద్దీ ఉండనుండటంతో ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. శ్రావణమాసం ఛాలెంజ్‌లో భాగంగా మహాలక్ష్మి టికెట్లతో సంబంధం లేకుండా మంచిర్యాల డిపోకు రూ.21 లక్షల ఆదాయం టార్గెట్ విధించారు. వరుస సెలవుల నేపథ్యంలో బస్సులు తిప్పడం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా అధికారులు నిర్ణయించారు.

ప్రత్యేక ఇన్సెంటివ్

మంచిర్యాల డిపోలో రోజుకు 61 వేల కి.మీ మేర బస్సులు రాకపోకలు సాగిస్తుండగా పండుగ నేపథ్యంలో మరో 6 వేల కి.మీ మేర అదనంగా బస్సులు నడపనున్నారు. ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఆడిషనల్‌గా విధులు నిర్వహించే కండక్టర్లకు కి.మీకి రూ.3 చొప్పున చెల్లించనున్నారు. ఉదాహరణకు ఆడిషనల్ 60 కి.మీ తిప్పితే రూ.3 చొప్పున 180 రూపేణా విధులు ముగియగానే చెల్లించనున్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం

రాఖీ సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. డిపో పరిధిలో హైదరాబాద్‌తోపాటు ప్రధాన రూట్లు కరీంనగర్, జన్నారం, ఆసిఫాబాద్, చెన్నూర్ రూట్లలో అదనపు బస్సులు నడపనున్నాం. జేబీఎస్ బస్‌స్టేషన్‌తోపాటు మంచిర్యాల డిపో వద్ద బస్సుల సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం.
– జనార్దన్, డిపో మేనేజర్, మంచిర్యాల

ఉత్తమ కార్మికులు వీరే..


ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికైన రాజలింగయ్య

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఉత్తమ కార్మికులను అధికారులు ఎంపిక చేసినట్లు జీఎం దేవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సింగరేణియన్‌గా పొట్ట రాజలింగయ్య (హెడ్ ఓవర్‌మెన్, శాంతిఖని), ఏరియా ఉత్తమ కార్మికులుగా కల్వల శంకర్ (జనరల్ మజ్దూర్, ఆర్కే-ఓసీ), ముద్దసాని చంద్రమోహన్ (ఈపీ ఆపరేటర్, ఆర్కే-ఓసీ), పల్లపు మల్లేశ్ (ఈపీ ఆపరేటర్, కేకే-ఓసీ), ముద్దసాని కోటయ్య (జనరల్ మజ్దూర్, కేకే-ఓసీ), మంద సమ్మయ్య (హామర్ మెన్, కాసీపేట), సీహెచ్ రాజు (కోల్‌కట్టర్, కాసిపేట), గోలెం శ్రీనివాస్, (జనరల్ మజ్దూర్, కాసిపేట-2), గంగారపు వేణుగోపాల్ (ట్రామర్ కాసిపేట-2), బానోత్ భరత్ (మైనింగ్ సర్దార్, శాంతిఖని), జంగం శాకుమార్ (టెండాల్, శాంతిఖని), ఏ.రాజశేఖర్ (కోల్‌కట్టర్, కేకే-5), డి.మొగిలి (టింబర్‌మెన్, కేకే-5), కొదాటి మహేశ్వర్ (హెల్పర్, ఆర్కేపీ సీహెచ్‌పీ) ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ సింగరేణియన్‌ను కొత్తగూడెంలో సీఎండీ బలరాం, ఏరియా ఉత్తమ కార్మికులను ఏరియాలో జీఎం దేవేందర్ సన్మానించనున్నారు.

శ్రీరాంపూర్ డివిజన్‌లో..


కె.భీరయ్య

శ్రీరాంపూర్: 77వ స్వాతంత్ర వేడుకల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్‌లో ఉత్తమ కార్మికులను ఎంపిక చేసింది. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 19 మందిని ఉత్తమ కార్మికులుగా ఎంపిక చేసి గురువారం ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో వారిని సన్మానించన్నారు. వీరిలో ఆర్కే 5 గని నుంచి కొట్టె మల్లేశం(ఎలక్ట్రీషన్), గొడుగు సమ్మయ్య (సపోర్ట్ మెన్), ఆర్కే 6 నుంచి సుదర్శన (టెండల్ సూపర్‌వైజర్), లక్ష్మయ్య (సపోర్ట్‌మెన్), ఆర్కే 7 నుంచి నాగరాజు (ఓవర్‌మెన్), దేవయ్య (లైన్‌మెన్), ఆర్కే న్యూటెక్ గని నుంచి సాంబయ్య (జనరల్ మజ్దూర్), భూమయ్య (ఎస్‌డీఎల్ ఆపరేటర్), ఎస్‌ఆర్పీ-1 గని నుంచి జి.వెంకటేశ్వర్‌రావు (డిప్యూటీ సూపరిండెంట్), ఈ.సమ్మయ్య (హాలేజ్ ఆపరేటర్), ఎస్సార్పీ 3, 3ఏ నుంచి డి.రామోజీ(గోపియా ట్రామర్), ఇందారం 1ఏ గని నుంచి సురేష్ బాబు (ఎస్‌డీఎల్ ఆపరేటర్), మహేశ్(ఫిట్టర్), ఇందారం ఓపెన్ కాస్ట్ గని నుంచి ఈశ్వర్ (ఈపీ ఫిట్టర్), జె.రమేశ్ (ఈపీ ఆపరేటర్), శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని నుంచి వెంకటేశ్వర్లు (ఫిట్టర్), గొల్ల సురేష్ (ఈపీ ఆపరేటర్), శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి కోటేశ్వరరావు (జనరల్ మజ్దూర్) ఉన్నారు.

కంపెనీస్థాయిలో కె.భీరయ్య..

వీరితోపాటు కంపెనీ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్తమ కార్మికుల్లో శ్రీరాంపూర్ ఏరియా నుంచి కర్రె భీరయ్య ఎంపికయ్యారు. భీరయ్య ఆర్కే 6 గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొత్తగూడెంలో జరిగే స్వాతంత్ర వేడుకల్లో యజమాన్యం ఆయన్ను సన్మానించనుంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు-2024కు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో మెయిన్స్ శిక్షణ సన్నద్ధమయ్యేందుకు మెంటార్ గైడెన్స్‌తోపాటు ట్యాబ్, ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు యూపీఎస్సీ, సీఎస్సీ, ప్రిలిమినరీ పరీక్ష 2024లో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 7382620487, 7093 466985 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రాజిరెడ్డి

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో తాటికొండ చంద్రయ్య ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రయ్య తన భార్యతో కలిసి సోమవారం రాత్రి చెన్నూర్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం వెలిగించి పోయారు. అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అప్పటికే బీరువాలో రూ.3.50లక్షలతోపాటు తులం బంగారం, 7 క్వింటాళ్ల బియ్యం, వెండిపట్ట గొలుసులు, సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రంజిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి మంగళవారం పరిశీలించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న బిస్వనాథ్ బెహరా

శ్రీరాంపూర్: విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంఎస్(ఎలక్ట్రికల్) బిస్వనాథ్ బెహరా తెలిపారు. మంగళవారం సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్‌లో ఎక్స్ ఆపరేటస్, ఓహెచ్ లైన్ల భద్రతపై అయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ప్రమాదాలపై అవగాహన ఉండాలన్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను విశ్లేషిస్తే ఎందుకు జరిగాయో తెలిస్తాయని దానికి అనుగుణంగా మరోసారి ఆ తరహా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. వ్యక్తిగత పనిముట్లు, రక్షణ పరికరాలు తప్పని సరిగా వినియోగించాలన్నారు. ఏరియాలో తీసుకుంటున్న విద్యుత్ ప్రమాదాల నివారణ, రక్షణ చర్యలను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి వివరించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ గుప్తా, ఏరియా ఎస్ఓటూజీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, శ్రీధర్, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, వీటీసీ మేనేజర్ రామారావు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ కోర్టు జడ్జి రవి మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం..జైపూర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల వైపు నుంచి చెన్నూర్ వైపు వెళ్తున్న లారీని ఆపారు. డ్రైవర్ ఆర్కే గజానంద్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు రుజువైంది. చెన్నూర్ కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించారు.

నకిలీ విలేకరిపై కేసు

జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాన్ని ఓ పత్రికస్టాఫ్ రిపోర్టర్‌ను అని డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ విలేకరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఈనెల 11న స్టాఫ్ రిపోర్టర్ అని, పత్రిక వార్షికోత్సవం సందర్భంగా తనకు రూ.5 వేలు ఇవ్వాలని రత్నం తిరుపతి డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే ఇబ్బంది పడుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని కరస్పాండెంట్ మధుసూదన్ ఫిర్యాదు చేశాడు. నకిలీ విలేకరి తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి


చుక్కల దుప్పి మృతదేహం

సిర్పూర్(టి): కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందింది. సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ కథనం ప్రకారం.. సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ పరిధి పరిసర ప్రాంతాల్లో మంగళవారం చుక్కల దుప్పిని కుక్కలు వేటాడుతున్నాయనే సమాచారం అందింది. అటవీ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. చుక్కల దుప్పిని తీసుకుని సిర్పూర్(టి) పశువైద్యశాలకు వెళ్లి చికిత్స అందించారు. అనంతరం చీలపెల్లి అటవీప్రాంతంలో వదిలేందుకు వెళ్తుండగా మృతి చెందింది. అనంతరం ఖననం చేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధర్‌చారి, ఎఫ్‌బీవో ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అన్నదమ్ముల గొడవ

- కూలీ డబ్బుల విషయంపై ఘర్షణ
- తమ్ముడి దాడిలో అన్న మృతి
- మోతుగూడలో ఘటన


సంజయ్‌కుమార్ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: కూలీ డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో తమ్ముడి దాడిలో అన్న మృతిచెందాడు. మండలంలోని మోతుగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ సతీశ్ కథనం ప్రకారం..మోతుగూడలో ఆర్‌సీసీ పైపుల ఫ్యాక్టరీ కంపెనీలో బీహార్‌కు చెందిన 12 మంది పని చేస్తున్నారు. యజమాని వరప్రసాద్ సోమవారం వారికి కూలీ డబ్బులు ఇచ్చారు. డబ్బుల విషయమై రాత్రి 10 గంటలకు అన్నదమ్ములు గొడవపడ్డారు. తమ్ము డు అజయ్ సొంత అన్న సంజయ్‌కుమార్ (32) కొట్టాడు. కిందపడి తలకు పైపు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఆసిఫాబాద్ ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. యజమాని ఫి ర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెన్షన్ కోసం నిరీక్షణ

- 11వ వేతన ఒప్పందం ప్రకారం పెన్షన్ చెల్లించాలి
- 1700 మంది రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుచూపు
- పెండింగ్‌లో సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లు



గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం

శ్రీరాంపూర్: సింగరేణిలో కొందరు రిటైర్డ్ ఉద్యోగులు రివైజ్డ్ పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. 11వ వేతన ఒప్పంద కాలపరిధిలో దిగిపోయిన మరికొందరికి పెరిగిన వేతనంపై పెన్షన్, సీఎంపీఎఫ్ సెటిల్‌మెంట్ కాలేదు. ఈ జాప్యం కారణంగా వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 11వ వేతన ఒప్పందం కాలపరిమితితో వారు దిగిపోయినప్పటికి 10వ వేతన ఒప్పంద వేతనం మీదనే జమచేసి సీఎంపీఎఫ్ శాఖ అధికారులు పెన్షన్ చెల్లిస్తున్నారు. ఇలా శ్రీరాంపూర్‌లో 1700 మంది రిటైర్డ్ ఉద్యోగులు రివైజ్డ్ పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ కేసులు త్వరగా సెటిల్‌చేయాలని సీఎంపీఎఫ్ శాఖ, కంపెనీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. 11వ వేతన కాలపరిమితి 1-7-2021 నుంచి మొదలు కావల్సి ఉంది. కాని ఒప్పందం 23 నెలల ఆలస్యంగా జరిగింది. అమలు మరింత జాప్యమైంది. ఎప్పుడు అమలైన పాత తేదీ నుంచే లెక్కించి వేతనాలు ఏరియర్స్‌గా చెల్లిస్తారు. పెన్షన్ కూడా రివైజ్డ్ చేయాల్సి ఉంటుంది. దీనికితోడు నాటి ప్రభుత్వం 60 ఏళ్ల రిటైర్మెంట్ వయస్సు 61 ఏళ్లకు పెంచడం, పెరిగిన అదనపు సంవత్సరం సెటిల్‌మెంట్లను కంపెనీ ప్రత్యేకంగా చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ రెండు కారణాలతో 1-7-2021 నుంచి ఫిబ్రవరి 28, 2024 మధ్య దిగిపోయిన 1700 మందికి కొత్త వేతనాలపై పెన్షన్ రావడం లేదు. వారంతా పెరిగిన వేతనాల ప్రకారం తమ పెన్షన్‌ను రివైజ్డ్ చేసి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతోపాటు పెన్షన్ ఏరియర్స్ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి వీవీ స్టేట్‌మెంట్లను ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు తయారు చేసి గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్‌శాఖ అధికారులకు పంపించారు. త్వరలో ఇవి సెటిల్ అవుతాయని వారు పేర్కొంటున్నారు.

ఇంకా పాత పెన్షనే వస్తుంది



నేను 25-12-2021లో రిటైర్డ్ అయ్యాను. ఇది 11వ వేజ్‌బోర్డు పరిధిలోనే ఉన్న ఇప్పటికి 10వ వేతన ఒప్పందం ప్రకారమే పెన్షన్ ఇస్తున్నారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనం మీద నాకు పెన్షన్ రివైజ్డ్ చేసి చెల్లించాలి. ఏరియర్స్ కూడా చెల్లించాలి. దీనివల్ల కనీసం రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు పెరుగుతాయి.
– వినయ్ ప్రశాంత్, రిటైర్డ్ ఉద్యోగి

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నస్పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ జడ్జి ఫస్ట్ క్లాస్ డి.ఉపనిషద్వని మంగళవారం తీర్పు వెలువరించారు. జులై 7, 2017లో కట్కూరి లింగయ్య.. పట్టణ పరిధిలోని నస్పూర్ గేట్ వద్ద 63వ జాతీయరహదారి దాటుతున్నాడు. ఆనందం ప్రైవేటు బస్సును అతివేగంగా వచ్చి లింగయ్యను ఢీకొని గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ లింగయ్య మృతిచెందాడు. అప్పటి సీసీసీ నస్పూర్ ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. పీపీ సహిన్ సుల్తానా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఈమేరకు జడ్జి తీర్పునిచ్చారు.

కంప్యూటర్ల చోరీ

కోటపల్లి: స్థానిక మోడల్ స్కూల్‌లో 7 కంప్యూటర్ల చోరీ జరిగింది. శని, ఆదివారం సెలవు కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేందర్ మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎస్టీపీపీలో 'హర్ ఘర్ తిరంగా'


జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తున్న అధికారులు

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీ ఇంచార్జీ ఈడీ, జీఎం ఎస్‌వీ.రాజశేఖర్‌రావు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్‌పర్మార్, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్‌లు జాతీయ జెండాలను ప్రజలకు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కేంద్రప్రభుత్వం, సింగరేణి సంస్థ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని కోరారు. అధికారులు శ్రీనివాసులు, సుధాకర్, మదన్‌మోహన్, సముద్రాల శ్రీనివాస్, అజ్మీర తుకారం, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో పనిచేసి వివిధ డిపార్టుమెంట్లకు బదిలీపై వెళ్తున్న అధికారులకు ఐఎన్టీయూసీ నాయకులు సన్మానించారు. ఏరియా వర్క్ షాప్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వర్క్‌షాప్‌లో విధులు నిర్వహించి ఏరియా స్టోర్స్‌కు బదిలీ అయిన డీజీఎం మల్లయ్య, ఆర్కే 6 గని డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేసి కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగానికి బదిలీపై వెళ్తున్న సునీల్ కుమార్‌లను ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు వారిని శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు కలవేన శ్యామ్, గరిగే స్వామి, భీంరావు, ల్యాగల శ్రీనివాస్, ఏరియా నాయకులు పాల్గొన్నారు. కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగానికి బదిలీ అయిన సునీల్ కుమార్‌ను శ్రీరాంపూర్ ఆర్కే 6 గనిపై అధికారులు ని మేనేజర్ ఈ.తిరుపతి, ఉద్యోగులు సన్మానించారు. గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ శ్యాం కుమార్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సంఘం సదానందం పాల్గొన్నారు.



ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద మెడికల్ కాలేజీ విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

నిందితులను శిక్షించాలి

మంచిర్యాలటౌన్: కోల్‌కతాలోని పీజీ వైద్య విద్యార్థిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఐఎంఏ, ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు రమణ, జనరల్ సెక్రటరీ కెవిఎల్ఎన్ మూర్తి, ట్రెజరర్ కెఎంఎన్ శ్రీనివాస్ ఉన్నారు.